# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 16-03-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

**1.** **ఆంధ్రరాష్ట్ర సాధనకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**

**2.** **రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు.**

**3.** **జల జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

**4.** **రాష్ట్రంలో రేపటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి.**

**5.** **జాతీయ టీకా దినోత్సవాన్ని ఈ రోజు నిర్వహిస్తున్నారు.**

==========================

ఆంధ్రరాష్ట్ర సాధనకు కృషి చేసిన పొట్టి శ్రీరాములు జీవితం ఆదర్శనీయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో పొట్టి శ్రీరాములు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..

..వాయిస్... 20 సెకన్లు....

మరోవైపు రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో పొట్టి శ్రీరాములు జయంతిని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఎన్టీఆర్, తిరుపతి, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, ప్రకాశం, శ్రీసత్యసాయి జిల్లాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో ఆయా జిల్లాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ మాట్లాడుతూ..

..వాయిస్...28 సెకన్లు....

--------------------------

జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు సురక్షిత త్రాగునీరు అందిస్తున్నామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లులోని అడవి పాలెం గ్రామాల్లో 4 కోట్ల రూపాయలతో చేపట్టనున్న జలజీవన్ మిషన్, రహదారుల అభివృద్ధి పనులను మంత్రి ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు స్వచ్ఛ జలాలు, రైతులకు సాగునీరు

అందించేందుకు అధిక ప్రాధాన్యతనిస్తుందన్నారు. జలవనరుల శాఖ అత్యవసర పనులకు 380 కోట్ల రూపాయలు నిధులు మంజూరు చేశామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

విద్యార్థి సంపూర్ణ వికాసానికి తోడ్పడేలా విద్యాబోధన ఉండాలని ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. విజయనగరం జిల్లా గంట్యాడ మండలం మధనాపురం ఆదర్శ పాఠశాల, జూనియర్ కళాశాల నుంచి స్మార్ట్ క్లాస్ రూమ్ కార్యక్రమాన్ని నిన్న ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా మొత్తం 10 పాఠశాలల్లో దృశ్య మాధ్యమం విధానంలో ఆయన ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ, స్మార్ట్ క్లాస్ రూమ్ విధానం ద్వారా డిజిటల్ అక్షరాస్యత, మాస్ కమ్యూనికేషన్, సైబర్ సేవలు మరింత వృద్ధి చెందుతాయని చెప్పారు. ఆధునిక సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి కోరారు.

---------------------------

వేసవి దృష్ట్యా నంద్యాల జిల్లాలో తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసుకుంటున్నామని రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. నంద్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వేసవి కాలం దృష్ట్యా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో మంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా ఎక్కడ తాగునీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ జలాలు తగ్గుదల, బోర్లు పనిచేయకపోవడం వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉన్నందున ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని మంత్రి సూచిస్తూ,

వాయిస్ 28 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో రేపటి నుండి పదవ తరగతి పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ ఒకటవ తేదీ వరకు జరిగే ఈ పరీక్షల కోసం రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 3 వేల 450 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 6 లక్షల 49 వేల 275 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ఉదయం 9 గంటల 30 నిముషాల నుండి 12 గంటల 45 నిముషాల వరకు పరీక్ష జరుగుతుంది. హాల్ టికెట్ చూపించిన విద్యార్థులకు ప్రభుత్వం, పరీక్షా కేంద్రాల వరకు ఆర్.టి.సి. బస్సులో ఉచితంగా ప్రయాణం చేసే వెసులుబాటు కల్పించింది. అవసరమైన పరీక్షా కేంద్రాలలో సి.సి. కెమెరాలు ఏర్పాటు చేశారు. ఏదైనా అవసరం ఉన్న వారు 0866 – 297 4540 నంబర్ కు ఫోన్ చేయవచ్చని అధికారులు తెలిపారు. ఇది ఇలా ఉండగా శ్రీ సత్యసాయి జిల్లాలో రేపటి నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు 104 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని జిల్లా విద్యా శాఖాధికారి కిష్టప్ప తెలియజేస్తూ,

వాయిస్ ..33 సెకన్లు

---------------------------

పట్టణ ప్రజలకు ప్రభుత్వ సేవలను ఫోన్‌లోనే అందించేలా 'పురమిత్ర' యాప్‌ను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సురేశ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు.

కృత్రిమ మేధ సాంకేతికతతో రూపొందించిన ఈ యాప్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ యాప్‌లో నీటి సరఫరా, పట్టణ ప్రణాళిక, ఆస్తి పన్ను, పురపాలక, వీధి దీపాలు, ప్రజారోగ్యం, పరిశుభ్రత వంటి సమస్యలపై ఫిర్యాదు చేయడంతో పాటు, పరిష్కారాలను తెలుసుకోవచ్చునని తెలిపారు. ఈ యాప్‌ను జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహ నమోదు వంటి సేవలకూ వినియోగించుకోవచ్చని తెలిపారు.

---------------------------

వివిధ రకాల వ్యాధుల నుండి రక్షణ కల్పించేందుకు టీకాలు ఏ విధంగా సహాయ పడుతుందని అంశంపై అవగాహన కల్పించేందుకు ఈ రోజు జాతీయ టీకా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వైద్యులు, ఇతర వైద్య నిపుణులు టీకాలు తీసుకోవడం వల్ల కలిగే లాభాలు, తీసుకోకపోవడం వల్ల జరిగే నష్టాలపై ఈరోజు అవగాహన కల్పిస్తారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్య పరిశోధకులు జోనస్ ఎడ్వర్డ్ సాల్క్ 1995 మార్చి 16 వ తేదీన పోలియో కోసం మొదటి సారిగా టీకా అభివృద్ధి చేశారు. భారత దేశంలో కూడా ఈ రోజునే మొదటిసారి నోటి ద్వారా తీసుకునే పోలియో టీకా మొదటి డోసు ఇచ్చారు. అప్పటి నుండి ప్రతి సంవత్సరం ఇదే రోజున జాతీయ టీకా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

రాష్ట్రాన్ని క్రీడాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర క్రీడా ప్రాధికారాభివృద్ధి సంస్థ–శాప్ చైర్మన్ రవినాయుడు తెలిపారు. తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో గొల్లవానిగుంటలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో నిర్మిస్తున్న క్రికెట్ మైదానం నిర్మాణ పనులను జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌తో కలిసి ఆయన ఈరోజు పరిశీలించారు. ఈ సందర్భంగా రవినాయుడు మాట్లాడుతూ, క్రీడాకారులను ప్రోత్సహించడంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. త్వరలోనే ఏకీకృత క్రీడా సముదాయాన్ని పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామని తెలిపారు.

---------------------------

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా 2 ప్రత్యేక రైళ్లను నడుపుతున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. విశాఖపట్నం–చర్లపల్లి రైలు ఈ సాయంత్రం 6గంటల 20 నిముషాలకు విశాఖపట్టణంలో బయల్దేరి, మరునాడు ఉదయం చర్లపల్లి చేరుకుంటుందని తెలిపింది. తిరుగు ప్రయాణంలో రేపు ఈ రైలు చర్లపల్లిలో ఉదయం 10 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 10 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని పేర్కొంది. ఈ ప్రత్యేక రైళ్లు దువ్వాడ, అనకాపల్లి, యలమంచిలి, తుని, అన్నవరం, సామర్లకోట, రాజమండ్రి, నిడదవోలు, తాడేపల్లిగూడెం, ఏలూరు, విజయవాడ, గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్గొండ స్టేషన్లలో ఆగుతాయని ప్రయాణికులు ఈ సదుపాయాన్ని వినియోగించుకోవాలని రైల్వే అధికారులు తెలిపారు.

=====================